క్లుప్తంగా

గ్రీవెన్స్ పిటీషన్ల పరిశీలన

తెనాలిరూరల్: రెవెన్యూ శాఖకు సంబంధించి గ్రీవెన్స్‌లో వచ్చిన పిటీషన్లను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ స్వయంగా పరిశీలించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మండలంలోని కఠెవరంకు చెందిన కంచర్ల భవానీశంకర్ మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కొలకలూరుకు చెందిన కొలసాని రమేష్‌బాబు రెవెన్యూ రికార్డుల నుంచి ఇతరు పేర్లను తొలగించాలని అర్జీ ఇచ్చాడు. వీటిని తహసీల్దార్ స్వయంగా పరిశీలించారు. ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామ సచివాలయాల్లో రికార్డులను పరిశీలించడంతో పాటు అర్జీదారులతో స్వయంగా మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలానే మండలంలోని నందివెలుగు గ్రామంలో ఏర్పాటు చేయనున్న మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ కోసం స్థలాలను పరిశీలించారు.

కఠెవరంలో చోరీ

తెనాలిరూరల్: మండలంలోని కఠెవరం గ్రామంలో చోరీ జరిగింది. ఇంట్లోని వారు ఆరు బయట నిద్రిస్తుండగానే లోపలికి ప్రవేశించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన షేక్ నసీమా, కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఆరుబయట నిద్రించారు. అర్థరాత్రి దాటాక లేచి చూడగా ఇంట్లోని బీరువా తెరచి ఉండి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారమందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలను నమోదు చేశారు. ఐదు సవర్ల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని నసీమా పోలీసులకు తెలిపింది. తెనాలి రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూతన వరుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: కుటుంబ కలహాలు ఓ నూతన వరుడి ఉసురు తీశాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సోమసుందర పాలెం గ్రామానికి చెందిన గుర్రం రాము (27)కు ఐదు నెలల క్రితం వివాహమైంది. ఇటీవల కాలంలో కుటుంబంలో కలహాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందగా మృతదేహాన్ని గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

మంగళగిరి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరాలని ఓటర్ల నమోదు అధికారి లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2025 ఓటర్ల ప్రత్యేక జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఇంటింటి సర్వే జరుగుతుందని చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ మాబు సుభాని, డెప్యూటీ తహసీల్దార్ ఎస్.సతీష్, రాజేష్, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శకుంతల, డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎలక్షన్ డీటీ షేక్ దరియావలి పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళాశాసనములతో ఉదయం 9 గంటలకు ధనలక్ష్మి, సంతానలక్ష్మి అమ్మవార్లకు తిరుమంజన సేవ, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ పెరుమాళ్లకు అభిషేకం ఘనంగా నిర్వహించామని తెలిపారు. అనంతరం శ్రీసూక్త హవనం, భూ వరాహ హోమం, అలంకరణ, అష్టోత్తర శతనామ పూజ, సాయంత్రం సహస్ర నామార్చన, వరలక్ష్మీ వ్రతం, నివేదన, నక్షత్ర హారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విజయకీలాద్రి అర్చక స్వాములు, జీయర్ వేదపాఠశాల వేదవిద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్: కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను లైంగిక దాడి చేసి హత్యచేసిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు డి.రమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని కొలనుకొండలోని సంఘ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌కు న్యాయం చేయాలని, ఆత్మహత్య అంటూ కేసును పక్కదోవ పట్టించి నేరస్తులను తప్పించేందుకు ప్రయత్నించి ప్రిన్సిపాల్‌కు రెండు రోజుల్లో పోస్టింగ్ ఇవ్వడం దారుణమని, ఆ ప్రిన్సిపాల్‌ను వెంటనే అదుపులోకి తీసుకోవాలని కోరారు. మన రాష్ట్రంలో వివిధ మెడికల్ కాలేజీలలో కూడా రక్షణ లేదని, ఏపీలో జూనియర్ డాక్టర్లు ఆందోళనకు పూనుకున్నారని పేర్కొన్నారు.

ఈ వార్డులపై ఎందుకింత కక్ష?!

- గతుకుల రోడ్లు.. లీకవుతున్న పైపులైన్లు..
- పట్టణ 23, 24 వార్డుల దుస్థితి
- ఈ వార్డుల్లో ప్రయాణం నరకప్రాయం



ఆర్‌ఆర్ నగర్ మలుపు వద్ద గొయ్యి



అధ్వానంగా ఉన్న గృహకల్పకు వెళ్లే రోడ్డు

తెనాలిరూరల్: పట్టణ 23, 24 వార్డులపై అధికారులు పక్షపాతం చూపుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అడుగడుగునా గుంతలమయంగా ఉన్న రోడ్లు, లీకవుతున్న రక్షిత మంచినీటి పైపులైన్లు ఇందుకు కారణం. వాహదారులు నిత్యం ఈ వార్డుల్లో నరకం అనుభవిస్తున్నారు. పట్టణ మారిస్‌పేట రెండు గేట్ల మధ్య ప్రాంతంలో 23, 24 వార్డులు ఉంటాయి. పట్టణంలోకెల్లా అధిక జనాభా ఉన్న వార్డు 23వ వార్డు. పట్టణంలో 40 వార్డులు ఉండగా 44 మురికి వాడలు ఉన్నట్టు అధికారులు నమోదు చేశారు. ఈ జాబితాలో ఈ రెండు వార్డులూ ఉన్నాయి. మురికి వాడలులే అన్న నిర్లక్ష్యమో లేక బడుగు బలహీన వర్గాల ప్రజలే కదా ఉండేదన్న అలక్ష్యమో తెలియదు కానీ ఆది నుంచి ఈ వార్డులంటే పాలకులకు, అధికారులకు చిన్న చూపే. రెండు గేట్ల మధ్య రోడ్డులో సుమారు 60 ఏళ్ల క్రితం నివాసాలు ఏర్పడ్డాయి. 40 ఏళ్ల క్రితం ఇక్కడి పొలాలను సేకరించి రెండు గేట్ల మధ్య రోడ్డుకు తూర్పు వైపున డాక్టర్ రావి రవీంద్రనాథ్ నగర్ పేరిట పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆర్‌ఆర్ నగర్‌గా ఈ కాలనీని పిలుచుకుంటారు. కాలక్రమంలో ఈ కాలనీ పూరిళ్లు పోయి పక్కా గృహాలను నిర్మించుకున్నారు. మొత్తం ఐదు లైన్ల ఈ కాలనీలో రెండులోపై 60 అడుగుల వెడల్పు ఉన్న రోడ్లు. ఇంత వెడల్పు ఉన్న రోడ్డు పట్టణంలోని మరో ఇతర కాలనీలో లేదు. రక్షిత మంచినీటి పథకం పుణ్యమా అని ఈ రోడ్డులో దశాబ్ద కాలంగా అడుగడుగునా గోతులే. ఇదే రోడ్డు చివరన రాజీవ్ గృహకల్ప సముదాయం ఉంటుంది. ఇక్కడకు వెళ్లాలన్నా నరకమే. పూర్తిగా దెబ్బతిన్న బీటీ రోడ్డు గతుకులమయంగా మారింది. ఇక ఈ కాలనీలకు వెళ్లేందుకు రెండు రైల్వే గేట్ల మధ్యలోని రోడ్డు ప్రధాన మార్గం. ఈ రోడ్డు సైతం గతుకులమయమే. ఈ ప్రాంతంలో నివసించే వారు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. అరడుగు మేర గోతులు ఏర్పడినా కనీసం తాత్కాలికంగా పూడ్చే ప్రయత్నమూ ఏ అధికారి చేయడం లేదు.

లీకుల పైపులు!

పట్టణ మారిస్‌పేట ఆర్‌ఆర్ నగర్‌లోని రాజీవ్ గృహకల్ప వద్ద నుంచి 60 అడుగుల రోడ్డు, వెలువోలు వారి వీధి మీదుగా 21వ వార్డుకు 2022లో పైపులైను వేశారు. ప్రధాన పైపులైను కోసం రోడ్డును పగులగొట్టే సందర్భంలో ఇళ్లకు ఇచ్చే కుళాయి కనెక్షన్‌ల పైపులు తెగిపోయాయి. వీటికి మరమ్మతులు సరిగా చేయించకుండానే కాంక్రీట్‌తో పూడ్చించారు. తాగునీరు సరఫరా చేసే సందర్భంలో ఈ రోడ్డులో నీరు ఫౌంటెన్‌లా ఎగజిమ్ముతోంది. స్థానికులు రాళ్లను అడ్డు పెట్టుకున్నారు. రోడ్డంతా నీళ్లు నిలుస్తున్నాయి. ప్రతి రోజు ఉదయం సాయంత్రం నీరు వదులుతుంటారు. ఈ సమయాల్లో 60 అడుగుల రోడ్డు మొత్తం చిత్తడిగా మారుతుంది. ఇంతే కాక ప్రధాన పైపులైను రేపల్లె గేటు నుంచి ఆర్‌ఆర్ నగర్ వరకు తరచూ లీకవుతూనే ఉంటోంది. పైపులైను మరమ్మతుల కోసం రోడ్డును తవ్వి రోజుల కొద్దీ వదిలేయడం ఇక్కడ నిత్యకృత్యమే. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

> **అంచనాలు సిద్ధం చేశాం**
>
> రెండు గేట్ల మధ్య రోడ్డు ద్వారకానగర్ వరకు మరమ్మతులు / నిర్మాణం కోసం అంచనాలు సిద్ధం చేశాం. అలానే 60 అడుగుల రోడ్డు, రాజీవ్ గృహ కల్ప రోడ్డు, అక్కడి నుంచి నీళ్ల ట్యాంకు రోడ్డు వరకూ రోడ్ల నిర్మాణం కోసమూ అంచనాలు సిద్ధం చేశాం. గతంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచాయి. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.
>
> –రాజు, మున్సిపల్ ఏఈ

వాజ్‌పేయికి ఘన నివాళి



తెనాలిరూరల్: భారత రత్న, భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిగర్వి, నిరాడంబరుడు అటల్ బిహారీ వాజ్‌పేయి నాటి జనసంఘ్‌లో ప్రధాన పాత్ర పోషించి ప్రజల హృదయాలలో నిలిచారని కొనియాడారు. అట్టడుగు వర్గాల బాధలను చూసి ప్రధానిగా బాధ్యతలు తీసికొన్న తరువాత అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. దేశంలో జాతీయ రహదారుల విస్తరణలో ఎంతో పురోగతికి ఆయన దోహదం చేశారని తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాజుల వెంకయ్యనాయుడు, సీనియర్ నాయకులు సి.హెచ్. విజయ భాస్కర్ రెడ్డి, కనకదుర్గ, మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడు కుశల్ రాజ్ జైన్, కార్యదర్శి వెచ్చా నాగరాజు, ప్రధాన కార్యదర్శి దారా సాయిగుప్త, ఉపాధ్యక్షులు టి.వెంకటేశ్వరరావు, డి. వీరయ్య, వై. కామేశ్వరపురావు, కె. శ్రీనివాసు, మంచాల రత్నరాజు, ఉపాధ్యక్షులు శిఖ రవీంద్రబాబు, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

ఐపీఏ స్టూడెంట్ ఫోరం అవతరణ దినోత్సవం

బెస్ట్ స్టూడెంట్ చాప్టర్‌గా ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీ అవార్డు



ప్రశంసాపత్రాలతో స్టూడెంట్ చాప్టర్ సభ్యులు

తెనాలి: ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫోరం అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఐపీఏ ఏఎస్ఎన్ కాలేజీ స్టూడెంట్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట రమణ, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్ ఫోరం దేశంలోని 4,684 ఫార్మసీ కాలేజీల్లోనూ ఉంటుందని డాక్టర్ కె.వెంకట రమణ తెలియజేశారు. వీటిలో గతేడాది పనితీరు ఆధారంగా ఏఎస్ఎన్ కాలేజీ స్టూడెంట్ చాప్టర్ జాతీయస్థాయిలో బెస్ట్ స్టూడెంట్ చాప్టర్ అవార్డును గెలుచుకుందని డాక్టర్ వెంకటరమణ వెల్లడించారు. బెస్ట్ స్టూడెంట్ చాప్టర్ అవార్డు గెలుచుకున్న చాప్టర్ సభ్యులకు డాక్టర్ కె.శ్రీనివాసరావు ప్రశంసాపత్రాలను అందజేశారు. హెల్త్ కేర్ అంటే వైద్యుడు, నర్సు, ఫార్మసిస్ట్, సభ్య బృందం అని ఆయన తెలియజేశారు. హెల్త్‌కేర్‌ను ఒక సవాలుగా తీసుకుని ప్రతి ఫార్మసిస్టు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి వ్యక్తి తన ఆరోగ్య సమస్యలను తానే తెలుసుకుని, నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చైతన్యం కలిగించాలని చెప్పారు. సభలో డాక్టర్ కె.శ్రీనివాసరావును సత్కరించారు. ఐపీఏ ఏఎస్ఎన్ మెంటార్స్ జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, ప్రెసిడెంట్ ఎస్.సునీల్ కుమార్, సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణే పండుగల పరమార్థం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: శ్రీ వరలక్ష్మీ వ్రత మహోత్సవం రోజైన శుక్రవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు ఆవరణలో గల ఏవీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటర్‌లో విద్యార్థినులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. పర్వదిన సంప్రదాయాన్ని నేటి తరం పదిలం చేసుకుంటూ మన సంస్కృతిని ముందు తరం కొనసాగించేలా భక్తి సంగీత పాటలు, దేశభక్తి పాటలు, సంప్రదాయ వేషధారణ, సందేశాత్మక నృత్య పోటీలను నిర్వహించారు. వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలను జరిపారు. న్యాయనిర్ణేతలుగా వాసంతి, ఎస్.పద్మజ, లక్ష్మీసుజాత, నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. వివేక విద్యాసంస్థల చైర్మన్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ తెలుగువారి ప్రతి పండగకు ఒక పరమార్థం ఉంటుందని చెప్పారు. శ్రావణమాసంలో రెండో శుక్రవారం, వరలక్ష్మీవ్రతంగా మహిళలు జరుపుకుంటారని తెలిపారు. వర్షాకాలంలో వాతావరణంలో జరిగే మార్పుల కారణంగా చర్మవ్యాధులు, జ్వర బాధలు రాకుండా ఉండేలా వరలక్ష్మీ వ్రతం పేరుతో పసుపు, కుంకుమ, చందనం వంటివి ఉపయోగించుకుని ఆరోగ్యానికి కాపాడుకోవటమే ఉద్దేశమని చెప్పారు. అందుకే పండగ సంప్రదాయానికి అనుగుణమైన వివిధ అంశాలపై పోటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తెలుగు సంప్రదాయం నేటితరానికి అలవరచటం, రాబోయే తరం అనుసరించాలనే భావనతో జరిపిన పోటీల్లో విద్యార్థినులు విశేషంగా పాల్గొన్నారు. పోటీలు అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, ప్రిన్సిపాల్ జ్యోతి, మానస, మురళీ, రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు



తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు బోధనాలను అందరూ అనుసరించాలని బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ జక్రయ్య, బ్రదర్ పినపాటి స్టీవెన్‌బాబులు పేర్కొన్నారు. పాండురంగపేటలోని మరనాత మహిమ చర్చ్‌లో 40 రోజులుగా జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ముగిశాయి. చర్చి పాస్టర్ గంటా డానియేల్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో తెనాలి టౌన్ పాస్టర్ అసోసియేషన్ నాయకులు రెవరెండ్ పల్లె శామ్యూల్, పాస్టర్ ఎం.సంసోను, రెవరెండ్ ఎస్.చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ప్రతిభా పురస్కారానికి మురళీకాంత్ ఎంపిక



తెనాలిఅర్బన్: సదరన్ ప్రైవేట్ లిమిటెడ్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారి జాతీయ ప్రతిభా పురస్కారానికి తెనాలిలోని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎంపికకు సంబంధించిన పత్రాన్ని పంపినట్లు ఆయన తెలిపారు. మురళీకాంత్ బిట్స్ పిలానీలో ఎంటెక్ పూర్తి చేసి కొంతకాలం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 12 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా విద్యార్థులకు విద్యనందించారు. ఈ నెల 25న గుంటూరులోని ఏసీ కళాశాలలో జరిగే ప్రధానోత్సవ కార్యక్రమంలో పురస్కాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అందించనున్నట్లు చెప్పారు. అవార్డుకు ఎంపికైన ఆయనను పలువురు అభినందించారు.

నేడు వైద్యసేవలు నిలిపివేత

తెనాలిరూరల్: కోల్‌కతాలో ఈ నెల 9వ తేదీన జరిగిన వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు, వైద్యులపై రౌడీ మూకలు దాడులు చేయడాన్ని నిరసిస్తూ శనివారం వైద్య సేవలను నిలిపివేస్తున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని అన్ని ప్రైవేటు వైద్యశాలల్లో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అన్ని ఓపీ సేవలు, శస్త్ర చికిత్సలను నిలిపివేస్తున్నామని, కేవలం అత్యవసర కేసులకు మాత్రమే వైద్య సహాయం అందుతుందని చెప్పారు. ప్రకటన జారీ చేసిన వారిలో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ మధుప్రభాకర్‌బాబు, డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ఉన్నారు.

కాటూరి ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించిన మంత్రి మనోహర్

శిల్పకళాకారుల నైపుణ్యాన్ని ప్రశంసించిన మంత్రి



ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించి తిలకిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి: ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వర రావు, కుమారులు రవిచంద్ర, శ్రీహర్ష సారథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'కాటూరి ఆర్ట్ గ్యాలరీ'ని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఆటోనగర్ శివారు కంచర్లపాలెంలో ఆరంభించిన ఆర్ట్ గ్యాలరీలో ఉంచిన 150 పైగా శిల్పాలను పరిశీలించారు.

దేశాన్ని పరిపాలించిన చక్రవర్తులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ ప్రముఖులు, బడుగు బలహీన వర్గాలకు విశేష సేవలందించిన మహనీయులు, సినీ రంగ ప్రముఖులు, మాజీ ముఖ్యమంత్రులు, ప్రముఖ శాస్త్రవేత్తల విగ్రహాలను ఉంచారు. వీటిలో అతి చిన్న విగ్రహం నుంచి అతి భారీ విగ్రహాల వరకు ఉన్నాయి. కాంస్య, ఫైబర్, ఇనుప వ్యర్థాలతో జీవం ఉట్టిపడేలా చేసిన విగ్రహాలతో పాటు త్రీడీ విగ్రహాలనూ మనోహర్ ఆసక్తిగా తిలకించారు. దేశంలోని వివిధ నగరాలతోపాటు ఇతర దేశాలకు పంపిన తమ శిల్పాలను గురించి కాటూరి వెంకటేశ్వర రావు వివరించారు. ఆసాంతం వాటిని పరిశీలించిన మంత్రి మనోహర్ ఆయా శిల్పాల్లోని కళానైపుణ్యాన్ని మెచ్చుకున్నారు. శిల్పకళలో తెనాలి ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెబుతున్న శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షను అభినందించారు. ప్రభుత్వం సహకరిస్తే ఆర్ట్ గ్యాలరీని దేశానికి పేరు తెచ్చేలా తీర్చిదిద్దుతామని, మరెందరికో ఉపాధిని కల్పిస్తామని శిల్పులు మంత్రిని కోరారు.

గౌతులచ్చన్న సేవలు మరువరానివి



గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు, శ్రీను

తెనాలిఅర్బన్: భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అని బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు కొనియాడారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో గౌతు లచ్చన్న జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాల్గొన్నారని తెలిపారు. 40 రోజులు జైలు జీవితం గడిపి స్వాంతంత్ర్య అనంతరం వివాహం చేసుకున్నారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యోదమ నాయకునిగా, మంత్రిగా ఆయన ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు కుర్రా శ్రీను, వేముల కృష్ణ, కురగంటి రవి శంకర్, మేడేపల్లి ప్రభాకర్, కొడాలి శ్రీనివాస రావు, నరాలశెట్టి సురేష్, అల్లం దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో...

తెనాలిరూరల్: స్థానిక రామలింగేశ్వరపేటలోని టీడీపీ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శుక్రవారం నిర్వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పాల్గొని గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, రైతు నాయకుడిగా సర్దార్ గౌతు లచ్చన్న అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. రాష్ట్ర మంత్రిగా వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి ఆయన కృషి చేశారని తెలిపారు. పలు ఉన్నత పదవులు చేపట్టిన ఆయన జీవించినంత కాలం విలువలతోనే ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, కేశన కోటేశ్వరరావు, మహ్మద్ ఖుద్దూస్, కటకం రవి, ఆదినారాయణ, ఫణిదపు దుర్గ, పూర్ణ, యోగేష్, పోతార్లంక చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యుత్ ఈఈ చిరంజీవి



ప్రశంసాపత్రం అందుకుంటున్న హెచ్‌సీ పెద్దయ్య

తెనాలిరూరల్: విధి నిర్వహణలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు లభించాయి. తెనాలి విద్యుత్ శాఖ ఈఈ వీవీ చిరంజీవి, ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ సానెపోగు పెద్దయ్య ప్రశంసాపత్రాలు అందుకున్నారు. గుంటూరు పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సమక్షంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా చిరంజీవి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలానే ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు, అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుకల నుంచి పెద్దయ్య ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరావుకు..



ప్రశంసా పత్రం అందుకుంటున్న సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు (సాయి)

కొల్లిపర: మండల తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బెజ్జం కోటేశ్వరరావు (సాయి)కు ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాన్ని అందజేశారు. 78వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డును అందించారని కోటేశ్వరరావు (సాయి) తెలిపారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సమక్షంలో మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని కోటేశ్వరరావు తెలిపారు.

ఎయిమ్స్ వైద్య విద్యార్థుల నిరసన

మంగళగిరి: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎయిమ్స్ విద్యార్థులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎయిమ్స్‌లో వైద్య విద్యార్థినిపై దాడిని ఖండిస్తూ విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. సమాజంలో పవిత్రమైన వృత్తిలో ఉండే డాక్టర్లుకు విలువలేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల డాక్టర్లపై దాడులు విపరీతంగా పెరిగిపోతున్నా ప్రభుత్వాల ఉదాసీనత వైఖరి కారణంగా ఇలాంటి ఘటనలు పునరావృత్తమవుతున్నాయని ఆరోపించారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

- తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చిన ఉన్నతాధికారులు
- వైద్యులు, వికలాంగుల విచారణ

తెనాలిఅర్బన్: సదరం సర్టిఫికెట్‌ల జారీలో అవినీతి ఆరోపణలు రావడంతో సెకండరీ హెల్త్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవి కిషోర్ శుక్రవారం తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చారు. ఈఎన్‌టీ, ఆర్థో, సైక్రాటిక్, అప్తామాలజీ విభాగాల వైద్యులు, సిబ్బందితో పాటు సర్టిఫికెట్‌ల కోసం వచ్చిన వికలాంగులను ఆయన విచారించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల వ్యాధులతో బాధపడే వారి కోసం సదరమ్ సర్టిఫికెట్‌లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. తెనాలి జిల్లా వైద్యశాలలో ఈఎన్‌టీ, ఆర్థో, సైక్రాటిక్, అప్తామాలజీ విభాగాలకు సంబంధించిన సదరం సర్టిఫికెట్‌లను మంగళ, శుక్రవారాలలో జారీ చేస్తుంటారు. వీటి జారీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావటంతో ఆయన తెనాలి వచ్చినట్లు తెలిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రికార్డులు పరిశీలించటంతో పాటు విచారణ జరుపుతున్నారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుబ్రమణ్యరాజు, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు ఉన్నారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో మహిళ గల్లంతు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌లో ఓ మహిళ శుక్రవారం గల్లంతు అయింది. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన సాంబయ్య, రమా భార్యాభర్తలు. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని విడివిడిగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. వారికి వివాహాలు చేశారు. వైఎస్సార్ కాలనీలో ఉండే రమా కేఎల్ రావు కాలనీలో నివసించే తల్లి రూతమ్మ ఇంటికి ఈనెల 13వ తేదీ వచ్చింది. సాయంత్రం సమయంలో కొట్టుకు వెళ్తానని చెప్పి ఇంటికి రాకపోవడంతో తల్లి పదే పదే ఫోన్ చేసినా ఎటువంటి సమాధానం లేదు. రాత్రి సమయంలో తన గురించి వెతకవద్దు అంటూ వాయిస్ మెసేజ్ పెట్టింది. తల్లి రూతమ్మ చుట్టుపక్కల వెతుకుతుండగా కృష్ణా నది అమరావతి కరకట్ట వెంబడి బకింగ్‌హామ్ కెనాల్‌పై చెప్పులు కనబడడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వచ్చి ఫిర్యాదు చేసిందని, బకింగ్‌హామ్ కెనాల్‌లో దూకి గల్లంతైందని భావిస్తున్నామన్నారు. ఘటనపై రమా తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.